


# అమెరికులాసా కథ – 201

## వికట వీరుల కథ

అవునయ్యా, మస్కయ్యా...ఇలాన్ మస్కయ్యా...ఇలా అయితే ఎలానయ్యా..

మమ్మల్ని వేధించుకుని, వేయించుకుని కర, కరా నమిలెయ్యడం, మస్కా మీద మీద మస్కా కొట్టడం, ట్రంప్ గారు ఉస్కో అంటే నువ్వు కూడా ఉస్కో అనడం ఎంత కర్కశం గా ఉందో మీ మస్తిష్కం లోకి ఏమైనా ఎక్కుతోందా? అవునులే....ప్రపంచంలో అత్యధిక ఐశ్వర్యవంతుడివి నువ్వే....నీ కంటే రెండు, మూడు మెట్లు తక్కువగాట్రంప్ గారు కూడా ఆయన సొంత విమానాలు, రాజ భవనాలు, అన్ని దేశాలలోనూ ఆ దిక్కుమాలిన గాల్ఫ్ కోర్సులతో తులతూగుతూ, ఇప్పుడు అమెరికా అధ్యక్షుడిగా రెచ్చిపోతున్న వాదే కదా!. అవునయ్యా..ఒప్పుకుంటాను. నీ మాట సాయం, రెండు వందల మిలియన్ డాలర్ల సాయం, బైడెన్ వృద్ధాప్యం, కమల గారి దిక్కుతోచని విధివిధానాల నిస్సహయత లాంటివి అన్నీ కలిసి, రోజు వారీ ఖర్చులు తగ్గిస్తాడేమో అని 77 మిలియన్ల అమెరికన్లు ట్రంప్ గారిని నెగ్గించారు. ఇప్పుడు ఆ ఖర్చులు తగ్గడం మాట దేవుడెరుగు...నువ్వేమో ఆ DOGE...అనగా కొత్తగా నీ కోసం ఏర్పాటు చేసిన డిపార్ట్ మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ పేరిట దేశాన్ని అల్లకల్లోలం చేస్తుంటే.. ట్రంప్–మస్క్ అనే మీ ఇద్దరు 'వికట వీరులు" మీ సైన్యంతో ఎటు నుంచి ఎలా ఎదుర్కుంటారో తెలియక మామూలు జనం గిజ గిజ లాడుతున్నారు పాపం. ఇది వరలో ట్రంప్ గారికి మస్కా కొట్టడానికి చాలా సార్లు మీడియా "తాట తియ్యాలి" అని బెదిరించిన కాష్ పటేల్ ఇప్పుడు ఎఫ్.బి.ఐ డైరెక్టర్ అయ్యాడు కాబట్టి ఇప్పుడు నిర్ఘుంగానే తమ మీద కక్ష తీర్చుకుంటాడేమో అని టీవీ చానెళ్ళ వారూ, పత్రికల వారూ గిజ, గిజ లాడుతూ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూనూ రోజు వారీ ఎంటర్ టైన్ మెంట్ కలిగిస్తున్నారు.

అవును కాని మస్క్ వీరుడూ....మొత్తం అమెరికా బడ్జెట్ లో కేవలం 1.2 % అనగా..ఈ 2025 లో సుమారు 55 బిలియన్ డాలర్లు ఖర్చు మాత్రమే అయ్యే అమెరికా సహాయక నిధి ..US AID ని పూర్తిగా నిలిపేసి ఏం బావుకుందాం అనుకున్నావ్? వరదలు, తుఫానుల లాంటి ప్రకృతి వైపరీత్యాలు, కరువు కాటకాల సమయం లో ఆహార పదార్థాలు, ఆఫ్రికా లాంటి దేశాలలో హెచ్.ఐ.వీ మొదలైన వ్యాధుల నివారణ, ప్రపంచవ్యాప్తంగా ఆకలి నివారణ మొదలైన సమాజ సంక్షేమ కార్యక్రమాలకే అధిక శాతం నిధులు ఖర్చు చేసే ఈ సంస్థని తకీమని ఆలోచనా రహితంగా రద్దు చేసే బదులు,

అసంబద్ధమైన, అనుమానాస్పదమైన వృధా ఖర్చులు తగ్గించే ఆలోచన కాస్త చేయవచ్చుగా? ఆ చేత్తోటే ప్రతీ ఏడాదీ ఇతర దేశాలకి సుమారు 125 బిలియన్ డాలర్ల్ ఆయుధాలు అమ్మే ఫారిన్ మిలిటరీ సేల్స్ ప్రోగ్రామ్ అనే కార్యక్రమాన్ని ఠకీమని రద్దు చేసి ఆ డబ్బు ఆదా చేయవచ్చు కదా!. అబ్బే...ఆపత్సమయాలలో ఇచ్చే డబ్బు అపాత్ర దానం....ఆయుధాల డబ్బు డబ్బే. ఇక ఏటా సుమారు 850 బిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టే అసలు తిమింగలం అయిన పెంటగాన్ మీద పడితే నీ శ్రమకి తగిన ప్రతిఫలం దక్కుతుంది కదా!. నీదాకా వచ్చిందో లేదో...మొన్ననే ఎక్కడో చదివాను..పెంటగాన్ వాళ్ళు కొనే పింగాణీ టాయ్ లెట్ ఖరీదు $14,000, చెత్త డబ్బా వెల $52,000, కాఫీ కప్పు: $$1280.ఇలా చాలానే ఉన్నాయి. అవన్నీ బంగారం తో చేసినవేమో ముందు కనుక్కో!.

అది కాదు కానీ మస్క్ వీరుడూ....నువ్వు ఏం చదువుకున్నావో, ఎక్కడ చదువుకున్నావో, ఎలా చదువుకున్నావో నాకు తెలీదు కానీ నీ ధర్మమా అని అమెరికాలో మాస్టర్స్, డాక్టరేట్లు, పోస్ట్ డాక్టరేట్లు చదువులు చదివి, రిసెర్చ్ లు చేసి, కొత్త వస్తువులు, మందులు..ఆఖరికి ఇప్పుడు నీ ఐశ్వర్యానికి కారణం అయిన టెస్లా ఎలెక్ట్రిక్ కార్లూ, స్పేసెక్స్ విమానాలూ, కొత్తగా వస్తున్న కృత్రిమ మేధా....లాంటివి కనిపెట్టి పేపర్లు ప్రచురించే ప్రొఫెసర్లు, రిసెర్చ్ ఇంజనీర్లు, డాక్టర్లూ ఇప్పుడు నీ ధర్మమా అని దుకాణాలు మూసేసి ఇంటికి వెళ్ళిపోయే పరిస్థితి వచ్చింది అని నీకు తెలుసా? నువ్వు నేషనల్ సైన్స్ ఫౌండేషన్, నేషనల్ హెల్త్ ఇన్స్టిట్యూట్ వాళ్ళనీ మూసేస్తే వాళ్ళ రిసెర్చ్ కి గ్రాంట్స్ గోవిందా, గోవిందా కదా!. అవునులే....ట్రంప్ గారూ. నువ్వూ కలిసి మొత్తం ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ నే మూసేసి చదువుల వ్యవహారాలు రాష్ట్రాలకే వదిలేస్తున్నప్పుడు ఈ జాతీయ వ్యవస్థలు అనవసరం అనే కదా నీ ఆలోచన!. ఇక ముందు నోబెల్ బహుమతులు అమెరికా వాళ్ళకి ఎలా వస్తాయి? అసలే అంతంత మాత్రంగా ఉన్న అమెరికా చదువులు ఇక ముందు ఎలా ఉంటాయో చూడాల్సిందే!.

ఇక నీకు తోడు ఆ రాబర్ట్ కెన్నెడీ జూనియర్ ట..ఆయనొకడూ మా ప్రాణాలకి. కోవిడ్ వేక్సీన్ అంతా మోసం..ఆ మాట కొస్తే అసలు వేక్సీన్లన్నీ ఎందుకూ పనికి రానివీ, కేన్సర్ రావడానికి అవే కారణం అంటాడేమిటీ? కొంపతీసి నువ్వూ, ట్రంపూ కూడా అలానే అనుకుంటున్నారా ఏమిటీ? ఇప్పుడు మీరు ఓవర్ ఏక్షన్ చేసి వేక్సీన్ ల ని నిషేధిస్తే మళ్ళీ కలరా, మశూచి, పోలియో లాంటివన్నీ తిరగబడతాయి అని తెలీదా?

ఇక మార్కో రూబియో గారు మా భారత్ కి విదేశాంగ మంత్రిలాగా అమెరికాకి విదేశీ యవ్వారాలు చూసే పెద్ద మనిషే కానీ, ఆయన ఎప్పుడూ ట్రంప్ గారి పక్కన బిక్క మొహం వేసుకునే కనపడుతున్నాడు పాపం. అవును కదా...యుక్రెయిన్ విషయంలో ఆ దేశం అధ్యక్షుడిని ట్రంప్ గారు “మేము మీకు 300 బిలియన్ డాలర్ల సహాయం చేశాం కదా. ఎవడబ్బ సొమ్మూ అనుకున్నావ్? చచ్చినట్టు మీ దేశం లో ఉన్న ప్లాటినమ్, సహజ వనరులూ ఇతర ఖనిజ సంపదా మాకు ఇస్తావా, చస్తావా?” అని బ్లాక్ మైల్ చేస్తున్నా, “జిమ్మీ కార్టర్ గారు వెనకా ముందూ చూసుకోకుండా మీకు

ధారాదత్తం చేసి పారేసిన మేము ఎంతో ఖర్చు పెట్టి నిర్మించిన పనామా కెనాల్ ని అమెరికా పేరిట మార్చేసి వెనక్కి లాగేసుకుంటాం" అని ఆ పని దగ్గరుండి చెయ్యడానికి తననే పంపించినా, "గ్రీన్ లాండ్ ని పరిపాలించడం లో అన్యాయం చేస్తున్న డెన్మార్క్ వాళ్ళు మాకు అమ్మకపోతే వాళ్ళ అంతు చూస్తాను" అని బెదిరించినా...ఆఖరికి కెనడా నిజానికి అమెరికాలో 51వ రాష్ట్రం గా ఉంటేనే బాగు పడుతుంది. ఆ పని మీదే ఉన్నాం" అని ప్రకటించినా...సదరు మార్కో రూబియో గారు చెయ్యగలిగేది అడ్డంగా తలఊపేసి బిక్క మొహం పెట్టడమే కదా! అమెరికాలో తల అడ్డంగా ఊపితే భారత్ లో నిలువుగా తల ఊపేసి ఒప్పేసుకున్నట్టే!.

ఇక అక్రమ వలస వాళ్ళ విషయానికే వస్తే.. అమెరికా అసలు సమస్య మెక్సికో సరిహద్దు దాటి అక్రమంగా వచ్చే లక్షలాది  వాళ్ళే కదా. వాళ్ళ సంఖ్యతో పోల్చి చూస్తే మా భారతీయులలో కొందరు..మహా అయితే .పది, పదిహేను వేల మంది కెనడా నుంచీ, మెక్సికో నుంచి గోడ దూకి రావడం, వాళ్ళలో అతి కొద్ది మంది మాత్రమే దుర్మార్గ ప్రవర్తన కలిగిన అసాంఘిక వ్యక్తులు కావడంలో పెద్ద ఆశ్చర్యం లేదు. అది మాకూ సిగ్గుగానే ఉంది. అయితే మటుకు వాళ్ళ కాళ్ళకి సంకెళ్ళు వేసి అంత హీనంగా సైనిక విమానాలలో అమృత సర్ పంపించడం ఎందుకో అంత సమంజసం అనిపించడం లేదు సుమా. కానీ, న్యాయ సూత్రాలు అందరికీ ఒక లాగే వర్తిస్తాయి కదా!.

ఇవన్నీ నాకెందుకు కానీ....నువ్వు మటుకు మా సోషల్ సెక్యూరిటీ నీ, మెడికేర్ నీ ముట్టుకున్నావంటే చూస్తూ ఊరుకునేది లేదు సుమా!. అప్పుడెప్పుడో రూజ్ వెల్ట్ గారు అమెరికా దేశానికి ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆ రెండూ మా జన్మహక్కు. అన్నట్టు, మస్క్ మహాశయా... అతి చిన్న తప్పులకి కూడా భారీ పెనాల్టీలు ఎడా పెడా వేసి ముక్కు పిండి, నిర్ధాక్షిణ్యంగా   మా దగ్గర ఇన్ కమ్ టాక్స్ వసూలు చేసే ఆ దిక్కుమాలిన ఐ. ఆర్ ఎస్...అనబడే ఇంటర్నెల్ సర్వీస్ సెంటర్ నుంచి వేల కొద్దీ ఉద్యోగస్తులని నువ్వు తీసిపారేశావు అని నిన్న టీవీలో చూడగానే, చెప్పొద్దూ...కాస్సేపు భలే సంతోషం వేసింది. ఎందుకంటే వచ్చే నెల ఏప్రిల్ 15 నాడు మేము టాక్స్ రిటర్న్ జమ చెయ్యాలి. ఇప్పుడు అక్కడ ఆఫీసర్లు తగ్గిపోయారు ఉన్న వాళ్ళు పెద్ద చేపల మీదే దృష్టి పెడతారు కాబట్టి నాబోటి పావలా, అర్ధణా మాత్రమే ఆదాయం పన్ను చెల్లించే మా బోటి గాళ్ళ జోలికి వచ్చి ఐ.ఆర్. ఎస్ వాళ్ళు ఆడిటింగ్ చేసే అవకాశం తగ్గుతుంది అనేదే నా శునాకానందం!.

మొత్తానికి చెప్పొచ్చేది ఏమిటంటే....అమెరికాలో ఇప్పుడు ప్రజాస్వామ్య నియంత పరిపాలన మొదలయింది అనే చెప్పుకోవాలి. అమెరికా రాజ్య సభ– సెనేట్, శాసన సభ– కాంగ్రెస్ లకి ఎన్నిక అయిన ప్రజా ప్రతినిధులు అందరూ కాశ పోశి చీర కట్టి, గాజులు వేసుకున్నట్టు కనపడుతున్నారు. ట్రంప్–మస్క్ అనే 'వికట వీరులు" ఇద్దరికీ అడ్డు చెప్పే ధైర్యం రిపబ్లికన్ పార్టీ వారికీ, డెమొక్రాటిక్ పార్టీ వారికీ లేదు. కొన్ని చోట్ల న్యాయ స్థానాలు చట్టవిరుద్ధమైన వాటిని నిరోధించే ప్రయత్నం చేస్తున్నా...కోర్ట్ ధిక్కరణ జరిగే అవకాశాలే ఎక్కువ.

అన్నట్టు నిన్న కూరలు కొనుక్కొడానికి వెళ్తే గుత్తి వంకాయలూ, టొమేటోలు, ఉల్లిపాయలూ అన్నీ ఇంకా ఖరీదుగానే ఉన్నాయి...వారం, వారం పెరుగుతూనే ఉన్నాయి. తను పదవి చేపట్టిన మొదటి రోజే నిత్యావసర వస్తువుల ధరలు తకీమని పడిపోయేలా చేస్తాను అన్నాడు కదా ట్రంప్ వీరుడు. మరి అప్పుడే నెల దాటి పోయింది. పాపం మర్చిపోయినట్టున్నాడు. బిజీగానే ఉన్నాడు కదా!.

'తప్పేదేలే' అని కావలసిన పాలూ, పెరుగూ కొనుక్కుని ఇంటికి రాగానే "ఓయ్ మొగుడూ. నెల్లాళ్ళ నుంచీ మన లాన్ వాడు ఫెర్నాండెజ్ గాడు రావడం లేదు. ఇంటి ముందూ, వెనకాలా గడ్డి ఎంత పెరిగిపోయిందో చూడు. " అంటూ ఫెర్నాండెజ్ కి ఫోన్ చేసి "ఈ ఫోన్ డిస్కనెక్ట్ చెయ్యబడింది." అని వినపడగానే....అయ్యో పాపం. ట్రంప్ గారి పుణ్యమా అని భార్య, ఇద్దరు పిల్లలతో గుట్టుగా సంసారం చేసుకుంటున్న మన ఫెర్నాండెజ్ భయపడి మెక్సికో పారిపోయి ఉంటాడు. రేపట్నుంచీ గడ్డి కోసే పని నీదే" అని ఆర్డర్ వేసింది మా క్వీన్ విక్టోరియా.

**COMMENTS**